సంరక్షణ లేని గోవులను గోశాలకు తరలిస్తాం

చింతపల్లిలో రోడ్డుపై తిష్టవేసిన పశువులు

ప్రజాశక్తి-చింతపల్లి: సంరక్షణ లేకుండా రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్న గోవులు, ఇతర మూగజీవాలను వాటి యజమానులు సంరక్షణ బాధ్యత తీసుకోకపోతే, గోశాలకు తరలించి యజమానులపై జరిమానాలు విధిస్తామని చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత హెచ్చరించారు. పట్టణం అభివృద్ధిలో భాగంగా నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారితో పాటు చింతపల్లి ప్రధాన రహదారులపై రాత్రి వేళల్లో గోవులు తిష్టవేయడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. పాలను తీసేసిన తర్వాత గోవులను నిర్లక్ష్యంగా రోడ్లపై వదిలేస్తున్న యజమానుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉత్తేజంగా స్పెషల్ డిఎస్‌సి జీపుజాతా

- ఎక్కడికక్కడ ఘన స్వాగతం
- నిరుద్యోగ యువతకు బాసటగా నిలుస్తున్న యాత్ర
- మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ టీచర్ పోస్టులను మినహాయించాలని డిమాండ్

ప్రజాశక్తి - అరకులోయ, అరకులోయ రూరల్, పాడేరు, చింతపల్లి, రాజవొమ్మంగి విలేకరులు

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కోసం ఏజెన్సీ వ్యాపితంగా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన చేపట్టిన జీపుజాతా ఉత్తేజంగా సాగుతోంది. గిరిజన నిరుద్యోగ యువతకు బాసటగా నిలుస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో షెడ్యూల్డ్ ప్రాంత టీచర్ పోస్టులను మినహాయించి, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గత నెల 31న పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో ప్రారంభమైన ఈ యాత్ర సోమవారం అల్లూరి జిల్లాకు చేరుకుంది. అరకులోయ, కించుమండ, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి ప్రాంతాల గుండా రాత్రికి రాజవొమ్మంగి మండలంలోని డి. మల్లవరానికి చేరుకుంది. ఈ జాతాకు అన్నిచోట్లా అపూర్వ ఆదరణ లభించింది. తొలుత ఈ యాత్రకు అరకులోయ మండలంలోని శరభగుడ గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఈ యాత్ర చొంపి గ్రామానికి చేరింది. తదుపరి మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అధ్యక్షతన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఈ జీపుజాతా ఏజెన్సీ గ్రామాల గుండా ముందుకు సాగింది. ఆయా చోట్ల జరిగిన సభల్లో, ర్యాలీల్లో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, అధ్యక్షులు లోతా రామారావు, సహాయ కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ ఈ నెల 4న రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనున్నట్లు తెలియవస్తోందని, దానిలో ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సిపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీలకు నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాల కోసం ప్రత్యేక చట్టం చేయాలన్నారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన గిరిజన సలహా మండలి (టిఎసి) సభ్యులు తక్షణమే సమావేశమై ఆదివాసీలకు ఉపయుక్తమైన పై డిమాండ్లపై తీర్మానం చేసి చట్టబద్ధత కోసం కృషి చేయాలని కోరారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి కోసం మాట్లాడకుండా మెగా డిఎస్‌సిలో 2000 పోస్టులు ఆదివాసీలకు వస్తాయంటూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అసత్య ప్రచారాలతో మభ్యపెడుతున్నారని విమర్శించారు. జిఒ నెంబర్ 3 రద్దుతో గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయన్నారు. ఈ నేపథ్యంలో ఆదివాసీలకు నూరు శాతం ఉద్యోగ కల్పనకు ప్రత్యామ్నాయ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.మహేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, గిరిజన మహిళా సంఘం అధ్యక్షురాలు హైమావతి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్, నాయకులు పాలికి లక్కు, ఎల్.సుందరరావు, జి.బుజ్జిబాబు, మాగన్న, సహదేవ్, రామారావు, పాంగి ధనుంజయ్, పాంగి బాలయ్య, సాగిన చిరంజీవి పడాల్, మజ్జి రాంబాబు, కిల్లో సింహాచలం, శేఖర్, బలరాం, కుంజం జగన్నాథం, కొండ్ల సూరిబాబు, కె.ప్రవీణ్, కె.గంగరాజు, కె.దొరబాబు, ఆదివాసీ పరిరక్షణ సమితి అధ్యక్షులు చట్టు మోహన్, డిఎస్‌సి సాధన కమిటీ కన్వీనర్ కిల్లో జగన్నాథం, కో-కన్వీనర్ అశోక్ కుమార్, గుజ్జెల సురేష్, పద్మాపురం యూత్ అధ్యక్షులు విజయ్, కేశవరావు, చిన్న పాల్గొన్నారు.

అరకులోయలో జీపుజాతాలో మాట్లాడుతున్న సురేంద్ర

డి.మల్లవరంలో మాట్లాడుతున్న లోతా రామారావు

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య

ముంపు గిరిజన గ్రామాల పట్ల నిర్లక్ష్యం వీడాలి

ప్రజాశక్తి - కూనవరం: పోలవరం నిర్వాసిత గ్రామాల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని శ్రీ మార్త శ్రీ రామ్మూర్తి భవన్ కర్నాటి శ్రీనివాస్‌రావు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. బాబు బొర్రయ్య మాట్లాడుతూ గత వరదలలో కలెక్టర్ పర్యటనకు వచ్చిన సందర్భంలో మండలానికి సంబంధించి పలు సమస్యలు సిపిఎం ప్రజాప్రతినిధుల ద్వారా పెద్దార్కుర్ గ్రామంలో వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య నాయకత్వంలో వినతిపత్రం అందించామన్నారు. అవి ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ప్రధానంగా వరదలు వస్తే పెద్దార్కుర్ పంచాయతీ నుండి రేగులపాడు పంచాయతీ వరకూ సుమారు 20 గ్రామాలు కరెంటు లేక చీకటిలో సుమారు మూడు నెలలు గడపాల్సి వస్తుందన్నారు. భీమవరం నుండి ఆర్అండ్‌బి రోడ్డు మీదగా బొజ్జరాయగూడం వరకు ఎత్తైన ప్రదేశంలో విద్యుత్తులైన్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరామన్నారు.కోతుల గుట్ట నుండి ఏడుగురాళ్లపల్లి, చిన్నర్కుర్ నుంచి బోదునూరు, ఆర్వాయిగూడెం నుండి తుమ్మల వరకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యలపై అధికారులు ప్రభుత్వం స్పందించక పోతే సిపిఎం తరపున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కమిటి నాయకులు మేకల నాగేశ్వరరావు, జిల్లా కమిటి పాయం సీతారామయ్య, మండల కమిటి సభ్యులు తాలూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో తొలగించే భవనాలకు మార్కింగ్ ఇస్తున్న రెవెన్యూ అధికారులు

ఆక్రమణలు తొలగించాల్సిందే..

తహశీల్దార్ సత్యనారాయణ

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: రాజవొమ్మంగిలో ఆర్అండ్‌బి రహదారికి ఇరువైపులా ఆక్రమించుకున్న వారు తక్షణం ఖాళీ చేయాలని తహశీల్దార్ అల్లు సత్యనారాయణ సోమవారం ఆదేశించారు. రాజఒమ్మంగిలో ఆర్అండ్ బీచ్ స్థలాల్లో ఉన్న దుకాణాలు భవనాలకు రెవెన్యూ అధికారులు మార్కింగ్ ఇచ్చారు. బుధవారం నుండి ఆక్రమణ లు తొలగించడం జరుగుతుందని వెల్లడించారు. గ్రామంలో ఇప్పటికే 138 మంది ఆక్రమణదారులకు 15 రోజులు క్రితమే నోటీసులు ఇవ్వడం జరిగిందని వెల్లడించారు. బుధవారం, గురువారం ఆక్రమణలు తొలగిస్తున్న నేపథ్యంలో రెండు రోజులు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జన్‌మన్ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యంపై

జిల్లా కలెక్టర్ సీరియస్

గ్రౌండింగ్ మేళా చేపట్టి వేగవంతం చేయాలని ఆదేశం

గృహనిర్మాణాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : ప్రధాన మంత్రి జన్ మన్ గృహాలు గ్రౌండింగ్‌లో ఎందుకు జాప్యం చేస్తున్నారని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసారు. గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసారు. గృహ నిర్మాణాలలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రౌండింగ్ మేళా పెట్టి మంజూరు చేసిన ప్రతి ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి హౌసింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, మైనింగ్ అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులు, ఎపిఇపిడిసిఎల్, సహకార శాఖ, 22 ఎంపిడి ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత ఇంటిని తొలగించ కుండా కొత్త ఇంటి నిర్మాణానికి స్థలం కేటాయించాలని సూచించారు. పాత ఇంటిలో హోం స్టేలు ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. మండలంలో వెయ్యి గృహాలుంటే మూడు వారాలు, వెయ్యికి తక్కువగా ఉంటే రెండు వారాల్లో గ్రౌండింగ్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. పూర్తి చేసిన 11,470 ఇళ్లలో ఈనెల 12న గృహ ప్రవేశాలు పూర్తి చేయాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని ఆదేశించారు. హర్‌ఘర్ జల్ పథకంలో లో నిర్మాణాలు పూర్తి తాగునీటి పథకాలను డిక్లరేషన్ చేయాలని సూచిచారు. 372 గ్రామాలకు 17 గ్రామాలలో మాత్రమే డిక్లరేషన్ చేసారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతీ 15 రోజులకు ఒకసారి డిక్లరేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ మంజూరు చేసిన పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఎంఎస్ఎంఇ కార్యక్రమాల పర్యవేక్షణకు ఇండస్ట్రియల్ అసిస్టెంట్ ప్రమోషన్ అధికారిగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చి నియమిస్తామన్నారు. పాడేరు డివిజన్‌లో 60, చింతూరు 20, రంపచోడవరం డివిజన్లో 40 చొప్పున జిల్లాలో 120 ఎంఎస్ఎంఇ యూనిట్లు నెలకొల్పాలని సూచించారు. జిల్లాలో ఇసుక రీచ్లపై ఆరా తీసి, . 40 వేలఇళ్ల నిర్మాణాలకు ఇసుక ఎక్కడ నుండి తరలిస్తున్నారని ఆరా తీసారు. మండల వారీగా ఇసుకు అవసరాలపై నివేదిక సమర్పిచాలన్నారు లోవోల్టేజి సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యుత్తు సమస్యలపై ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఎ పిఒలు అభిషేక్ గౌడ, కె. సింహాచలం, హౌసింగ్ ఇఇ బి. బాబు, డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్. కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి జి.రవిశంకర్, జిల్లా సహకార అధికారి ఎంవి. రామకృష్ణంరాజు, మైనింగ్ ఎడి ఎం. ఆనంద్, సిపిఒ ఎస్ఎస్ఆర్‌కె. పట్నాయక్ పాల్గొన్నారు.

రెండు లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

ప్రజాశక్తి-పాడేరు : పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒకేరోజున రెండు లక్షల మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. సామూహిక వనాల పెంపకం వనం-మనం కార్యక్రమంలో భాగంగా, అటవీ శాఖ తరపున ఒక లక్ష, అటవీ అభివృద్ధి సంస్థ 50 వేల మొక్కలు, ఐటిడిఎల ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, డ్వామా సంయుక్తంగా 50 వేల మొక్కలు నాటాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఆయా విభాగాలు ప్రాథమిక లక్ష్యాన్ని దాటి ముందుకు సాగాలని, రాబోయే మూడు రోజుల్లో, 4 లక్షల మొక్కలను నాటడానికి ప్రయత్నించాలని కలెక్టర్ కోరారు.

ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం థీమ్ 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఓడించండి'కి అనుగుణంగా, చర్యలు తీసుకోవాలనిడివిజనల్ అటవీ అధికారి పివి సందీప్ రెడ్డిని ఆదేశించారు. మొక్కలు సీడ్ బాల్స్ సేకరణకుఎన్జీవోలతో సమన్వయం చేసుకోవాలన్నారు. 20వేల సీడ్ బాల్స్ 10వేల మొక్కలను సరఫరా చేయడానికి (సెంటర్ ఫర్ హ్యూమానిటేరియన్ యాక్షన్ (సిఇఎఫ్‌హెచ్‌ఎ) ట్రస్ట్‌తో ఒప్పందం జరిగిందన్నారు. అందులో భాగంగా 'బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్'థీమ్‌కు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సిల్వర్ ఓక్ వంటి అన్యదేశ జాతుల కంటే దేశీయ జాతులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. క్లియర్ చేయబడిన రోడ్ల వెంబడి ఆర్ఒఎఫ్ఆర్ కింద తోటల పెంపకాన్ని చేపట్టాలన్నారు..

రేషన్ బియ్యంలో కోత!

రెండేసి కిలోలు తగ్గించి ఇవ్వడంపై కార్డుదారుల విస్మయం

రేషన్ డిపో వద్ద పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: పేదలకు ఇచ్చే రేషన్ బియ్యంలో రెండు కిలోలు కోత విధిస్తున్నారు. మే, జూన్ నెలలకు చెరో కిలో బియ్యం తగ్గించి ఇవ్వడంతో ప్రజలు నివ్వెర పోతున్నారు .ప్రభుత్వం పేద ప్రజలకు అందించే రేషన్ బియ్యంలో కోత విధించడం ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని లోతేరు పంచాయితి తోడుబంద, కురిసేల గ్రామాలకు చెందిన 80 కుటుంబాలకు సోమవారం గత నెల రేషన్ బియ్యం ఇవ్వలేదు. దీంతో రెండు నెలలు రేషన్ బియ్యం కోసం ఉదయం నుండి డిపో వద్ద పడిగాపులు కాస్తున్న పరిస్థితి నెలకొంది. అయితే మే,జూన్ నెల బియ్యం కలిపి ఇచ్చారు. అయితే రెండు నెల బియ్యం కలిపి రెండేసి కిలోలు కుదించి కార్డుదారులకు ఇచ్చినట్లు రేషన్ కార్డు దారులు తెలిపారు ప్రతి కార్డుదారులకు బియ్యం కోత విధించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రేషన్ బియ్యం కోతపై డిపో సెల్స్‌మెన్‌ను ప్రశ్నిస్తే తమకు సంబంధం లేదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచుతున్నామని సమాధానమిస్తున్నట్లు తెలిపారు. దీనిపై డిప్యూటీ తహశీల్దార్ ఫిర్యాదు చేయగా, ఆయన స్పందిస్తూ సేల్మ్యాన్‌తో మాట్లాడి ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని కార్డుదారులు తెలిపారు.

పోలవరం నిర్వాసితుల గోడు పట్టదా..!

- పరిహాసంగా మారిన పునరావాసం ప్యాకేజీ
- వరదల భయంతో నిర్వాసితులు

పునాదుల దశలో నిలిచిపోయిన ఇళ్లు

ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - విఆర్ పురం: పోలవరం ముంపు బాధితులు తమ గోడు ఎవరికీ పట్టడం లేదని వాపోతున్నారు. నిర్వాసితులకు ప్యాకేజీ పునరావాసం ఇవ్వటంలో మొదటి నుండి పాలక ప్రభుత్వాలు వ్యత్యాసం చూపుతున్నారని ఆయా గ్రామాల గిరిజన, గిరిజనేతరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగువ పోలవరం ప్రాజెక్టు వద్ద నీరు నిలువ ఉంచటం వలన ఏటా వచ్చే వరదలకు అనేక గ్రామాల్లో నిర్వాసితులు ముంపుతో నానా అగచాట్లు పడుతున్నారు. గత మూడు నాలుగు సంవత్సరాలుగా వారికి కేటాయించిన పునరావాస కాలనీలు పూర్తవకపోవడం, ఇక్కడ ఉందామంటే ముంపు భయం వెంటాడుతోందని నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. జూన్ ప్రారంభంలోనే వర్షాలు జోరుగా కురుస్తున్నాయని ఇక వచ్చే రెండు మరూడు నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అని భయాందోళన చెందుతున్నారు. మొదటి కాంటూర్‌లో పరిస్థితి ఇలా ఉంటే రెండో కాంటూర్‌లో పలు గ్రామాలకు ప్యాకేజీ ఇవ్వలేదని పలువురు నిర్వాసితులు వాపోతున్నారు. పునరావాసం కాలనీలవైపు ఏ ఒక్క అధికారి కన్నెత్తిచూడకపోవడంతో ఎక్కడి కక్కడ కాలనీలో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయి మొండిగోడలతో దర్శన మిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పోలవరం నిర్వాసితులకు కేటాయించిన అన్ని పునరావాస కాలనీలలో మిగిలి ఉన్న పనులు కల్పించాల్సిన మౌలిక సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

అట్టహాసంగా డిసిసిబి చైర్మన్ కోన తాతారావు ప్రమాణ స్వీకారం

కోన తాతారావుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న బ్యాంకు సిఇఒ వర్మ

కోన తాతారావును అభినందిస్తున్న ఎంపి ఎం. శ్రీభరత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ గా, జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. మర్రిపాలెంలోని బ్యాంకు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ తాతారావుచే బ్యాంకు సిఇఒ డివిఎస్ వర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్, అనకాపల్లి ఎంపి సి.ఎం.రమేష్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, విఎంఆర్‌డిఎ చైర్మన్ వి. ప్రణవ్‌గోపాల్ తదితరులు హాజరై నూతన చైర్మన్ కోన తాతారావును అభినందించారు.

బ్యాంకు అభివృద్ధి, రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం : తాతారావు

విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అభివృద్ధి, రైతుల సంక్షేమం ప్రధాన ధ్యేయంగా పనిచేస్తానని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కోన తాతారావు అన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి సహకారంతో బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. జిల్లాలోని పార్లమెంట్, అసెంబ్లీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో బ్యాంకు పురోభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా రైతుల జీవన ప్రమాణాలను పెంచడానికి ప్రణాళికను రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. నాబార్డ్, ఆప్కాబ్ నుంచి అధిక నిధులను తమ బ్యాంకుకు తీసుకు రావడానికి కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం ఉన్న బ్యాంకు టర్నోవర్ రూ.2400 కోట్ల నుంచి రూ. 3 వేల కోట్లకు పెంచేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో కృషి చేయడం జరుగుతుందని వెల్లడించారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అపూర్వభరత్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చింతూరు : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఐటిడిఎ పిఒ అపూర్వభరత్ సూచించారు. చింతూరు ఐటిడిఎ సమావేశ భవనంలో సోమవారం సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను మలేరియా కేసుల వివరాలపై సమీక్ష చేశారు. మొదటి విడత దోమలమందు పిచికారీ సమయంలో సచివాలయం సిబ్బంది హాజరైన తీరు, ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రే తదితర విషయాలపై సమీక్షించి తగు ఆదేశాలు ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు సమస్యాత్మక గ్రామాలు సందర్శించి మలేరియా కేసులు వచ్చిన ప్రాంతాల్లో ఫాగింగ్ చేయాలన్నారు. పారిశుధ్యం క్షీణించకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలం వస్తుండడం వల్ల జ్వరాలు విజృంభించకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా మలేరియా అధికారి రోజువారి మలేరియా కేసుల వివరాలు తీసు కోవాల్సిన చర్యలపై రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. సమావేశానికి ఎంపిడిఒ, ఇఒఆర్‌ఎటిడబ్ల్యూఒ, మెడికల్ ఆఫీసర్లు తదితరులు హాజరయ్యారు.

ఇంటింటికీ రేషన్ నిలిపేయడంతో అవస్థలు

ప్రజాశక్తి - సీలేరు: రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ నిలిపివేయడం వలన గిరిజ ప్రాంతంలో ప్రజలు పలు అవస్థలు పడుతున్నారని సీలేరు పంచాయతీ సర్పంచ్ పాంగి దుర్గో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఇంటింటి రేషన్ సరఫరా కార్యక్రమాన్ని ప్రభుత్వం నిలిపివేయడం అన్యాయం అన్నారు. గతంలో అయితే ఇంటింటికీ రేషన్ రావడం వల్ల కూలి పనులకు వెళ్లినా ఉదయాన్నే రేషన్ తీసుకుని వెళ్లేవారని అందువల్ల ఇబ్బంది ఉండేది కాదన్నారు. సీలేరు పంచాయతీ పరిధిలో లైకాన్‌పూర్, చంద్రుపల్లి గ్రామాల వారు 2, 3 కిలోమీటర్లు చింతపల్లి క్యాంపు నుంచి ఒక కిలోమీటరు దూరం నుంచి కాలినడకన వచ్చి రేషన్ తీసుకోవాలంటే తలకి మించిన భారంగా తయారైందని వాపోయారు. కూలి పనులకు వెళ్లి ఇల్లు చేరేసరికి ఇబ్బంది అవుతోందని రాష్ట్ర ప్రభుత్వం యధాతధంగా ఇంటింటికి బియ్యం సరఫరా కార్యక్రమాన్ని చేపట్టాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు ఏర్పాటు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించడానికి, భారత రైల్వే బోర్డు పలు రైళ్లకు తాత్కాలిక ప్రాదిపదికన అదనపు కోచ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో 18526/18525 విశాఖపట్నం - బ్రహ్మపూర్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ 22820/22819 విశాఖపట్నం- భువనేశ్వర్ - విశాఖపట్నం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లకు రెండు జనరల్ సిటింగ్ కోచ్‌లు అదేవిధంగా 18512/18511 విశాఖపట్నం - కోరాపుట్ - విశాఖపట్నం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, 58528/58527 విశాఖపట్నం - రాయ్‌పూర్ - విశాఖపట్నం ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్, 58538/58537 విశాఖపట్నం - కోరాపుట్ - విశాఖపట్నం ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్, 58532/58531 విశాఖపట్నం - బ్రహ్మపూర్ - విశాఖపట్నం ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్, 58504/58503 విశాఖపట్నం - భవానీపట్న - విశాఖపట్నం ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్, 58506/58505 విశాఖపట్నం - గుణుపూర్ - విశాఖపట్నం ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్‌లకు ఒక జనరల్ సిటింగ్ కోచ్‌లను 2025 జూన్ 1 నుంచి 2025 జూన్ 30 వరకు అదనంగా జత చేయనున్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

దోమల నివారణకు సహకరించాలి

ప్రజాశక్తి -పాడేరు: దోమల నివారణ మందు పిచికారీకి ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్‌కుమార్ కోరారు. ఏజెన్సీలో దోమల వ్యాప్తిని అరికట్టడానికి ఎసిఎం ఐదు శాతం మందును మలేరియా ప్రభావిత ప్రాంతాలలో పిచికారీ చేస్తున్నారన్నారు. సోమవారం కలెక్టరేట్లో మలేరియా నివారణ మాసోత్సవం వాల్‌పోస్టర్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల ఒకటి నుంచి 30 వతేదీ వరకు నిర్వహించే మలేరియా నివారణ మాసోత్సవంలో ఇంటింటికి తిరిగి ఇంటా, బయటా దోమల మందు పిచియారీ చేయాలన్నారు. మలేరియా మరణాలు జరిగితే క్షేత్రస్థాయి వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించాలన్నారు. టిబి ముక్తి భారత్ అభియాన్ వాల్‌పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. క్షయ వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స అందిస్తున్నారన్నారు. రెండేళ్లలో టిబి వచ్చిన కుటుంబాలలో అందరికి టిబి పరీక్షలు నిర్వహించాలని సూచించారు.. క్షయవ్యాధి నిర్మూలనా కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. టిబి నిర్ధారణ పరీక్షలు ముమ్మరంగా చేపట్టాలన్నారు వ్యాది గ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ జమాల్ భాషా, డిఎంఒ తులసి, ఎస్‌సి లోకేశ్వరరావు, క్షయవ్యాధి నిర్మూలనాధికారి డాక్టర్ సూర్యనారాయణమ్మ, వైద్య, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

పిఎం సూర్యఘర్ యోజనపై అవగాహన

ప్రజాశక్తి -పాడేరు : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన, సోలార్ విద్యుత్తుపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. సోమవారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు, ట్రాన్స్‌కో, గిరిజన సంక్షేమం, పంచాయతీ రాజ్, ఎంపిడిఒలు, తాహశీల్దారులతో పీ ఎం సూర్య ఘర్ సోలార్ విద్యుత్తు ప్యానెల్స్ ఏర్పాటుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటిపై కప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునే వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం రాయితీలు ఇస్తుందన్నారు. విద్యుత్తు వినియోగదారులు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం వలన విద్యుత్తు పోతుందనే టెన్షన్ ఉండదన్నారు. పట్టణ, గ్రామీణ ప్రజలు సోలార్ ప్యానెల్సుకు అర్హులన్నారు. ఇంటిపై కప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడానికి స్థలం ఉన్న ప్రతి ఒక్కరూ పి. ఎం. సూర్య ఘర్ పథకానికి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సమావేశంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎ పిఒలు డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ, కట్టా సింహాచలం, అపూర్వ భరత్ ట్రాన్స్‌కో ఎస్ఇ. ప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని, డిపిఒ బి. లవరాజు, 22 మండలాల ఎంపిడిఒలు, తాహశీల్దారులు పాల్గొన్నారు.

వైసిపి పాపమే వెంటాడుతోంది!

ప్రజాశక్తి-చింతపల్లి: వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్య పాలన గిరిజన గ్రామాలను అభివృద్ధికి దూరం చేసిందని, ఆ పాపాలే నేటి కూటమి ప్రభుత్వ మెడకు చుట్టుకుని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని జనసేన చింతపల్లి మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు మండిపడ్డారు. సోమవారం బిజెపీ మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణతో కలిసి కుడుముసారి పంచాయతీ జడుగూరు గ్రామాన్ని సందర్శించారు. స్థానిక గిరిజనులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు స్వయంగా పరిశీలించారు. ఊటగెడ్డ నుంచి గ్రామస్తులు తాగునీటిని సేకరించడాన్ని చూశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు,నేడు పేరుతో పాఠశాలల రూపురేఖలు మార్చుతామని హామీ ఇచ్చిన వైసిపి ప్రభుత్వం, పాఠశాలల నిర్మాణాలు ప్రారంభ దశలోనే నిలిపేసి, ఆదివాసీ గ్రామాలకు విద్యావకాశాలను దూరం చేసిందనానరు. గ్రామంలో 30 మంది చిన్నారులున్నా అంగన్‌వాడీ భవనం లేకపోవడం, 42 మంది విద్యార్థులకు పాఠశాల భవనం లేకపోవడం వారి దుస్థితికి నిదర్శమన్నారు. లభించకపోవడం దుర్వినియోగ పాలనను స్పష్టం చేస్తుందని చెప్పారు. గ్రామానికి తారు రోడ్డు, మంచి నీటి వంటి మౌలిక వసతులు లేవన్నారు. ఆయా సమస్యలను డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పాంగి సుబ్బారావు, కొర్ర కష్ణ, కొర్ర గిరి పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాకే పనులు

- రోడ్డు విస్తరణ బాధితులకు ప్రత్యామ్నాయం చూపండి

- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-చింతపల్లి : అల్లూరి జిల్లాలో రోడ్డు విస్తరణలో దుకాణాలు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతే ఖాళీ చేయించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు జోగంగి చిన్నయ్య పడాల్ అధికారులను కోరారు. చింతపల్లి మండల కేంద్రంలో కూడా రోడ్డు విస్తరణ చేపట్టారు. ఆర్అండ్‌బి స్థలమైతే 40 మీటర్లు, పంచాయితీ స్థలం అయితే 30 మీటర్లు ఇప్పుడున్న మెయిన్ రోడ్ నుంచి మధ్యపక్కల ఉన్న షాపులు ఇల్లులు ఖాళీ చేయాలని ప్రభుత్వం, కోర్టు ఆదేశించిందన్నారు. చింతపల్లిలో రోడ్డుకు ఇరువైపుల దుకాణాలు, ఇల్లు ఖాళీ చేయాలని నోటీసులివ్వడంతో సోమవారం ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో చింతపల్లి డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఐదవ షెడ్యూల్ గిరిజన ప్రాంతంలో సర్వాధికారాలు గిరిజన సలహా మండలి సూచనతో రాష్ట్ర గవర్నర్, రాష్ట్రపతికి తప్ప పరిపాలిస్తున్న ప్రభుత్వాలకు ఇక్కడ భూమిపై అధికారం లేదన్నారు. గతంలో సమత స్వచ్ఛంద సంస్థ, బిర్లా కంపెనీ మధ్య జరిగిన చర్చలో సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. అటువంటప్పుడు ప్రభుత్వం చెప్పింది కోర్టు ఆదేశించింది. ఆదివాసి గిరిజనుల షాపులు ఇల్లులు ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇచ్చి, ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే తొలగింపులు చేయాలని చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలని చిన్నయ్య పడాల్ కోరారు. లేకపోతే బాధితులతో కలిసి జిల్లా కలెక్టరేట్ వద్ద వస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రోడ్డు విస్తరణ బాధితులు వసుపరి హంసరాజు, ఆటో డ్రైవర్ రమణ, సాగిన రామరాజు. నరేష్. ఉమా. గంగన్నపడాల్. జల్లి సుధాకర్. పాల్గొన్నారు.

డిటికి వినతిపత్రం ఇస్తున్న విస్తరణ బాధితులు

జిల్లాలో థీమ్ బేస్డ్ యోగా

- నేడు అరకులో పర్యాటకులతో...

- రేపు రంపచోడవరంలో గిరిజనంతో...

- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు, : యోగాంధ్రలో భాగంగా ఈనెల 4న రంపచోడవరం డివిజన్లో ఐదు వేల మంది ట్రైబల్ కమ్యూనిటీతో యోగాను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లాలోని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు, ఎంపిడిఒలతో టెలీ కాన్ఫరెన్స్‌లోకలెక్టర్ మాట్లాడుతూ అన్ని జిల్లాలలో థీమ్ బేస్డ్ యోగాలు నిర్వహించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అల్లూరి జిల్లాలో ట్రైబల్ కమ్యూనిటీ యోగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యోగాలో ఐదు వేలమంది వరకు రెబెల్ కమ్యూనిటీ భాగస్వాములు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రంపచోడవరం డివిజన్ గంగవరం మండలంలో జిల్లా పరిషత్ హైస్కూల్, జూనియర్ కాలేజ్ మైదానంలో యోగ సాధనకు ఏర్పాట్లు చేయాలని ఎస్‌డిసి అంబేద్కర్, డిఎల్‌డిఒ కోటేశ్వరావును ఆదేశించారు.

నేడు అరకులో పర్యాటక యోగా

ఈనెల 3న అరకు ట్రైబల్ మ్యూజియంలో వెయ్యి మందితో పర్యాటక యోగ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. యోగాంధ్రలో భాగంగా జిల్లాలో నాలుగు రోజులపాటు పర్యాటక యోగాకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో గత నెల 29న అనంతగిరి మండలం బొర్రా గుహల వద్ద 1100 మందితో యోగ సాధన నిర్వహించారు. అదే స్ఫూర్తితో మూడవ తేదీన అరకులో యోగ సాధన నిర్వహించాలన్నారు. ఈనెల 11న మారేడుమిల్లిలో, 17న చాపరాయి జరపాతాల వద్ద పర్యాటక యోగ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు.

యోగసాధనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, యోగ సాధన దినచర్యలో భాగం కావాలని సూచించిన కలెక్టర్, ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మందితో యోగ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అందులో భాగంగా అల్లూరి జిల్లా నుండి 4,32,545 మంది యోగ కార్యక్రమంలో నమోదు చేసుకోవాలని లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 3,91,032 మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. కేవలం మరో 9శాతం మిగిలి ఉన్నందున, మండలాల ఎంపిడిఒలు యోగ లక్ష్యసాధనపై దృష్టి సారించాలని ఆదేశించారు.కొన్ని సచివాలయాల పరిధిలో యోగ పోటీలు నిర్వహించకపోవడం లేదా పోర్టల్‌లో అప్లోడ్ చేయకపోవడంపై ఆరా తీసిన కలెక్టర్, గ్రామస్థాయి పోటీలు పూర్తయినందున వాటి వివరాలను వెంటనే అప్లోడ్ చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. మంగళవారం నుంచి మండల స్థాయి పోటీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.టెలి కాన్ఫరెన్స్‌లో జెసి డాక్టర్ అభిషేక్ గౌడ, ప్రాజెక్ట్ అధికారులు కె.సింహాచలం, అపూర్వ భరత్, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా యోగా నోడల్ అధికారి ఎంవిఎస్ లోకేశ్వరరావు పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో యోగా

జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు నిర్వహించినట్లు పాడేరు డివిజనల్ ఫారెస్ట్ అధికారి పివి సందీప్ రెడ్డి తెలిపారు. పాడేరు, జీనబాడు అరకు, అనంతగిరి రేంజ్‌ల పరిధిలో సుమారు 70 మంది అటవీ అధికారులు, సిబ్బంది యోగ సాధనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిఎఫ్ఒ మాట్లాడుతూ, యోగ సాధనతో అటవీ సిబ్బంది ఫిట్‌నెస్ మెరుగుపడుతుందన్నారు. ప్రతిరోజూ యోగ సాధన చేయాలని సూచించారు యోగ సాధనలో పలువురు అటవీ అధికారులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం పోలీసుస్టేషన్ పరిధిలో బస్సు ఢీకొని ఒకరు మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మల్కాపురం ట్రాఫిక్ పోలీసుల కథనం ప్రకారం... అనకాపల్లి ప్రాంతానికి చెందిన రామ్మూర్తి (38), నారాయణరావు (32) తాపీ మేస్త్రిలుగా పనులు చేస్తుంటారు. వీరు అనకాపల్లి నుంచి గాజువాక మీదుగా మల్కాపురం వైపు వెళుతుండగా మధ్యలో హెచ్‌పిసిఎల్ గేటు స్పీడ్ బ్రేకర్ వద్ద బస్సు వీరు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామ్మూర్తికి కాలు విరిగిపోయింది. తీవ్రంగా గాయపడిన నారాయణరావును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు వివరాలను సేకరించి, మృతుని కుటుంబానికి సమాచారం అందించారు. మల్కాపురం సిఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యాన కేసు నమోదుచేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-సీతమ్మధార : రైల్వే న్యూ కాలనీ తాటిచెట్లపాలెం వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని నాలుగో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు తనిఖీ చేపట్టారు. రైల్వే న్యూ కాలనీ వద్ద 1500 కేజీల బియ్యంతో వస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-ఉక్కునగరం : గాజువాక మండలం గొల్ల జగ్గరాజుపేటలో చెట్టుకు ఉరేసుకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి దువ్వాడ పోలీసులకు సమాచారం అందించారు. మృతుని వయసు 30 సంవత్సరాలు ఉంటుందని, వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు. మృతుని వివరాలు ఎవరికైనా తెలిస్తే దువ్వాడ సిఐ (9440796053)కు సమాచారం ఇవ్వాలని కోరారు.

చోరీకి పాల్పడిన ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి -గాజువాక : చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసి, చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు క్రైమ్ ఎస్ఐ మన్మధరావు తెలిపారు. క్రైం పోలీసుల కథనం ప్రకారం... పైడిమాంబ కాలనీకి చెందిన చేపల ఆనంద్ (24), గంగవరానికి చెందిన కంబాల శ్రీరాజు (22) కలిసి ఈనెల 26వ తేదీ రాత్రి గాజువాకలో నివాసముంటున్న ఉరుకూటి నూకాలమ్మ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. నూకాలమ్మ మెడలోని బంగారు గొలుసును దొంగలించారు. ఈ దొంగతనంపై నూకాలమ్మ పోలీసులను ఫిర్యాదు చేశారు. గాజువాక పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి బంగారు గొలుసు, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ పాత నేరస్తులని, వీరిపై సస్పెక్ట్ సీట్ ఓపెన్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి- సీతమ్మధార : హాస్టల్‌లో చేర్పిస్తామని తల్లిదండ్రులు చెబుతుండడంతో మనస్థాపం చెందిన ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అక్కయ్యపాలెంలో కార్పొరేటర్ వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తికి కుమారుడు, ఏడో తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు. ఆదివారం బాలిక తండ్రి విధులకు, తల్లి ఓ వేడుక నిమిత్తం ఆనందపురం, అన్నయ్య స్నేహితుల వద్దకు వెళ్లిపోయారు. సాయంత్రం అందరూ తిరిగొచ్చేసరికి తలుపులు మూసి ఉన్నాయి. స్థానికుల సాయంతో తలుపులు తెరిచి చూడగా బాలిక ఆత్మహత్యకు పాల్పడి కనిపించింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హాస్టల్‌లో చేరడం ఇష్టం లేకనే బాలిక ఇలా ఆత్మహత్యకు పాల్పడినట్టు ప్రాథమికంగా గుర్తించి పోలీసులు కేసు నమోదు చేశారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుమార్తె మృతిచెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

'వెన్నుపోటు దినం' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చింతపల్లి: గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎంపిపి కోరాబు అనూషాదేవి ఆరోపించారు. సోమవారం జడ్పిటిసి పోతురాజు బాలయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు దురియా పుష్పలతతో కలిసి వెన్నుపోటు దినం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈనెల 4న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గిరిజన సంఘం నాయకులు పాయం సీతారామయ్య

జీపుజాతాను జయప్రదం చేయండి

- ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సీతారామయ్య

ప్రజాశక్తి - కూనవరం: ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జీపుజాత జయప్రదం చేయాలని గిరిజన సంఘం నాయకులు పాయం సీతారామయ్య పిలుపునిచ్చారు. జిఒ నెంబర్ 3ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న చట్టాలను పరిగణలోకి తీసుకొని గిరిజన ప్రాంతంలో చదువుకున్న గిరిజన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వకుండా రాష్ట్ర మొత్తం గిరిజన జనాభా లెక్కించి ఉద్యోగాలు ఇవ్వడం దారుణమని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు వంద శాతం ఉన్న ఆ ప్రాంతంలో గిరిజనులకు ఉద్యోగం ఇవ్వకుండా గిరిజనేతరులకు అవకాశం కల్పించడం అంటే గిరిజన చట్టాలను తుంగలో తొక్కడమే అన్నారు. మెగా డిఎస్‌సిలో గిరిజనేతరులకు అవకాశం ఇవ్వడం అంటే గిరిజనులను మోసం చేయడమే అని విమర్శించారు. తక్షణమే ఏజెన్సీ డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అప్పలరాజును అరెస్ట్ చేయాలి

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇళ్లు కట్టిస్తామని చెప్పి లక్షలాది రూపాయలు వసూలు చేసి, మోసగించి పరారైన పాల వెంకట అప్పలరాజును అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ, సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ కార్యాలయం ఎదుట మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జగదాంబజోన్ నాయకుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఇళ్లు కట్టిస్తామని చెప్పి సుమారు రూ.3 కోట్లు వసూలు చేసి అప్పలరాజు పరారయ్యాడన్నారు. రామ్‌నగర్‌కు చెందిన ఈ ఘరానా మోసగాని వ్యవహారంపై బాధితులు త్రీ టౌన్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. నిందితులను దాచిపెట్టిన అప్పలరాజు కుటుంబ సభ్యులపై కూడా పోలీసులు కేసు నమోదు చేసి చర్య తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలను లీజుకివ్వడం తగదు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : కూటమి ప్రభుత్వం 17 వైద్య కళాశాలలను పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) పేరుతో ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించడం తగదని దీనిని పిడిఎస్ఒ తీవ్రంగా ఖండిస్తోందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఎ.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 66 సంవత్సరాలు లీజుకు ఇవ్వాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జిఒ 107, 108 రద్దు చేసి ఎంబిబిస్ సీట్లను శతశాతం ప్రభుత్వ కోటాలో భర్తీ చేయాలన్నారు.

47 శాతం పెరిగిన నానో ఎరువుల అమ్మకాలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : గడిచిన మూడు సంవత్సరాల మాదిరే ఈ ఏడాది కూడా తమ ఎరువుల అమ్మకాల్లో 47 శాతం పెరుగుదల చూశాయని ఇఫ్కో సంస్థ చైర్మన్ దిలీప్ సంఘాన్ని తెలిపారు బీచ్‌రోడ్‌లో ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన సమీక్ష అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువుల విక్రయాల్లో ఉత్తమ ఫలితాలు ప్రదర్శించామని, త్వరలోనే తమ సంస్థ ద్వారా జింక్ ద్రవరూపంలో నానోకాపర్ 100 ఎంఎల్ బాటిల్ ఎరువును విడుదల చేయనున్నామన్నారు. బయో ఎరువుల అమ్మకాలు కూడా పెరిగాయన్నారు. ఇఫ్కో సహకారిత రత్న అవార్డ్, ఇఫ్కో సహకారి బంధు అవార్డులతో ఇద్దరు కో-ఆపరేటర్లను సత్కరిస్తున్నామని ఆయన తెలిపారు. 40కి పైగా దేశాల్లో తమ కార్యకలాపాలు విస్తరించాయని తెలిపారు.

అనధికార నిర్మాణంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మాధవధారలోని తమ ఇంటిని ఆనుకుని ఉన్న 120 గజాల స్థలంలో బిల్డర్ గ్రూప్ హౌస్ నిర్మిస్తున్నారని, అందులో తమకు చెందిన స్థలాన్ని కూడా ఆక్రమించి,సెట్‌బాక్స్ ఏమి వదలకుండానే నిర్మాణం చేస్తున్న విషయంపై కలెక్టర్‌కు మూల సన్యాసిరావు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనధికార నిర్మాణంపై ఇదివరకే జివిఎంసి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. బిల్డర్‌ని ప్రశ్నించానని, జివిఎంసి, సచివాలయం సిబ్బంది సహాయం తనకు ఉందని సమాధానం ఇచ్చాడన్నారు.

కులధ్రువీకరణ పత్రాల పేరుతో వేధింపులు సరికావు

బిఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కులధ్రువీకరణ పత్రాల పేరుతో ఎస్‌టి అధికారులను, పెన్షనర్లను బిఎస్ఎన్ఎల్ మహారాష్ట్ర సర్కిల్‌లో వేధింపులకు గురిచేయడాన్ని నిరసిస్తూ, సోమవారం డాబాగార్డెన్స్‌లోని బిఎస్ఎన్ఎల్ జిఎంటిడి కార్యాలయం ఎదుట పెన్షనర్లు నిరసన తెలిపారు. ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐబి డిపిఎ జిల్లా కార్యదర్శి కె.రామాంజనేయులు, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.ఈ.సిహెచ్.వి సాగర్ మాట్లాడుతూ ఎఐబి డిపిఎ, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. చాలా సంవత్సరాలుగా బిఎస్ఎన్ఎల్ యాజమాన్యం కులధ్రువీకరణ పత్రాల పేరుతో ఎస్టీ అధికారులను,పెన్షనర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. డిఒపి, టిసూచనలను, డాట్ ఆదేశాలను బిఎస్ఎన్ఎల్ యాజమాన్యం ఉల్లంఘిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా బిఎస్ఎన్ఎల్ యాజమాన్యం పదవీ విరమణ చేసిన ఎస్‌టీ అధికారులకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, ఎ.ఎ.అశ్రఫ్, ఎస్.ఎస్.ఎన్.రాజు, డి.రామారావు, కె.ఎస్.ఎన్‌రెడ్డి, ఎం.మోహనరావు, టి.ఎ.ఎన్.రాజు, మీనాకుమారి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న బిఎస్ఎన్ఎల్ పెన్షనర్లు

విత్తన బంతులతో వనాలు పెంపు అవసరం

విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విత్తనబంతులతో సామాజిక వనాలు పెంచడం అవసరం అని విఎంఆర్డిఎ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అన్నారు. సోమవారం విఎంఆర్డిఎ, సిఫా, గ్రీన్ అంబాసిడర్స్, ఎస్ఆర్‌యు, జివిఎంసి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒల నేతృత్వంలో కైలాసగిరి కొండపై 20 వేల విత్తన బంతులు చల్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విత్తన బంతులతో సామాజిక వనాలు పెంచడం అవసరం అన్నారు. పదివేల సంవత్సరాల క్రితం వ్యవసాయం చేయడం ప్రారంభించిన కాలంలో విత్తనబంతులు తయారు చేసి తమకు అవసరమైన చోట వనాలు పెంచారని, ఆ విధానాన్ని మన కైలాసగిరి మీద కూడా అనుసరించామన్నారు. అనంతరం మెట్రో పాలిటిన్ కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ అడవులు కాపాడే బాధ్యత మనందరిదీ అన్నారు. కార్యక్రమం లో సిఫా ట్రస్ట్ సిఇఒ డాక్టర్ శశిప్రభ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ పివి ముకుందరావు, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ శ్రీనివాసరావు, ఎస్ఆర్‌యు - జివిఎంసి ప్రాజెక్ట్ ఇంజినీర్ దాట్ల వివేక్‌వర్మ, విఎంఆర్డిఎ అధికారి సుజాత శివాని, కైలాసగిరి హార్టికల్చర్ ఆఫీసర్ రమేష్, ఎస్ఆర్‌యు, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జే వి రత్నం, గ్రీన్ వాలంటీర్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కైలాసగిరిపై విత్తనబంతులు చల్లుతున్న ప్రణవ్‌గోపాల్

పిల్లలు సృజనాత్మక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు

సమావేశంలో పాల్గొన్న అరసం నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పిల్లలు తమ చుట్టూ జరిగే అంశాలను పరిశీలిస్తూ సృజనాత్మక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పల రాజు అన్నారు. సోమవారం పూర్ణామార్కెట్ దరి రంగిరీజువీధిలో బాలల గ్రంథాలయంలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమవేదిక, అరసం సంయుక్తంగా నిర్వహించిన ఒకరోజు శిక్షణ తరగతుల్లో అప్పలరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

పుస్తకాలను చదివితే చాలా విషయాలు బోధపడతాయని, వాటిని మీకు నచ్చిన భాషలో రాయడం ద్వారా పునాది ధృఢం అవుతుందని, సృజన (క్రియేటివిటీ) అలవడుతుందన్నారు. చిల్డ్రన్ లైబ్రేరియన్ టి.పోలితల్లి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అరసం జిల్లా భాధ్యులు, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక జిల్లా కన్వీనర్ బసు పోతన రిసోర్స్‌పర్సన్‌గా పిల్లలకు సజనాత్మక నైపుణ్యాలను వివరించారు. కార్యక్రమంలో కె.వి.ఎస్ నరసింహం, చిల్డ్రన్ రీడర్స్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై చర్యలేవీ?

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తనపై దాడి జరిగి మూడు వారాలు గడిచినప్పటికీ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలుగుశక్తి అధినేత బి.వి.రామ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంపై జాతీయ మానవ హక్కుల కమిషనుకు ఫిర్యాదు చేసిన విషయాన్ని కలెక్టర్ ఎం.ఎన్ హరేంద్ర ప్రసాద్‌కు సోమవారం రామ్ ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తనపై దాడి చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని, హోటల్ వద్ద జరిగిన సంఘటన సిసి ఫుటేజ్ బయట పెట్టాలని కోరారు. పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినప్పుడు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అయితే సిపి ఆదేశాలను గాజువాక ఎసిపి, సిఐ లెక్క చేయలేదన్నారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరసన తెలుపుతున్న గంగవరం నిర్వాసితులు

నిర్వాసితులకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గంగవరం ఆదాని పోర్ట్ యాజమాన్యం నిర్వాసితులు ఒక్కొక్క కుటుంబానికి బకాయి ఉన్న రూ.27లక్షలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ, సోమవారం గంగవరం అదాని పోర్ట్ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సంఘ సభ్యులు గంటిపల్లి అమ్మోరు,నొల్లి తాతారావు తదితరులు మీడియాతో మాట్లాడుతూ యాజమాన్యం ఇచ్చిన హామీ ప్రకారం 60 రోజుల్లో నగదు పూర్తిగా చెల్లించలేదన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కోడి వ్యర్థాల సేకరణ, రవాణాలో అవినీతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ : కోడి వ్యర్థాల సేకరణ, రవాణాలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి, అధికార కూటమి ప్రజాప్రతినిధుల చీకటి వ్యాపారంపై విచారణ జరపాలని, అందుకు ఫ్లోర్ లీడర్లతో కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు సోమవారం ఉదయం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. దీర్ఘ కాలంగా నగరంలో కోడి వ్యర్థాల సేకరణ, రవాణాలో టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ అండతో తీవ్ర అనైతిక, ప్రమాదకర అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నారని తెలిపారు. వ్యర్థాలను నిబంధనల ప్రకారం కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉన్నా, దాన్ని ఉల్లంఘించి అక్రమంగా చేపల చెరువులకు తరలించి కోట్ల రూపాయలు పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ వ్యర్థాలు వినియోగించిన చేపల చెరువుల్లోని చేపలు తిన్న ప్రజలు కేన్సర్, కిడ్నీ, లివర్ వంటి ప్రమాదకర జబ్బులకు గురవుతున్నారని తెలిపారు. ఈ అనైతిక కుంభకోణంలో కొంతమంది తెలుగుదేశం, జనసేన అధికార కూటమి ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉన్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయన్నారు. లక్షల రూపాయలు ప్రతి నెలా అక్రమంగా ఈ ముఠా నుంచి ముడుపులు పొందుతున్నారని తెలుస్తోందన్నారు. కొంతమంది అధికార పార్టీ కార్పొరేటర్లు, ఎంఎల్‌ఎలే ఈ చీకటి వ్యాపారానికి ప్రధాన పాత్రదారులు కావటం అత్యంత ఆందోళన కలిగిస్తోందన్నారు.

యర్ర విశ్వనాథం మాస్టారుకు పురస్కారం

ప్రజాశక్తి - విశాఖపట్నం : శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బారువ హైస్కూల్లో పనిచేసిన హిందీ మాస్టారు యర్ర విశ్వనాథంకు విద్య, సామాజిక రంగంలో విశిష్ట సేవలకుగాను ఆ హైస్కూల్ పూర్వ విద్యార్థులు తీర ప్రాంత ఎక్స్‌ప్రెస్ పత్రిక తరుపున ఉగాది - 2025 పురస్కారాన్ని సోమవారం సాయంత్రం అందజేశారు. విశాఖ నగరంలోని మద్రిపాలెంలోగల మాస్టారి స్వగృహానికి వారంతా తరలివచ్చారు. కార్యక్రమం నిర్వాహకులు, బారువ హైస్కూల్ పూర్వ విద్యార్థి, తీర ప్రాంత ఎక్స్‌ప్రెస్ స్టేట్ బ్యూరో చీఫ్ దున్న భాస్కర్‌రావు ఉగాది పురస్కారాన్ని మాస్టారుకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆనల వాసుదేవరావు, ఆర్.శ్రీనివాసరావు, ఆర్.రామకృష్ణ, డి.సిం హాద్రి, కొత్తపల్లి జోత్స్న, కొత్తపల్లి హారిక, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, టి.లోకనాథం, టి.గురుమూర్తి, బారువ హైస్కూల్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.